కేంద్ర ప్రభుత్వాన్ని దింపే వరకూ పోరు

- రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడిని గద్దె దించండి
- సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : మోడీ అధికారం చేపట్టిన నాటినుంచి దేశం లో సామాన్యులు బతకలేని పరిస్థితి దాపురించిందని, దేశ సంపద కార్పొరేట్ లకు కట్టబెట్టి సామాన్యుల పై ఆ భారం వేస్తున్న బీజేపీ పాలనను,రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దివాలా పట్టించిన జగన్ రాష్ట్ర భవిష్యత్తు లేకుండా చేశాడని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడి వారిని గద్దెదించే వరకూ పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అన్నారు. ప్రచార భేరి కార్యక్రమంలో బాగంగా శనివారం స్థానిక బ్యాంకర్స్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఇవాళ మన దేశంలో ప్రమాదకరమైన రాజకీయాలు చూస్తున్నామన్నారు. భారతదేశంలో ఈరోజు అవునన్నా కాదన్నా అతిపెద్ద దేశంగా మారిందన్నారు. గతంలో చైనా అత్యధిక జనాభాగా ఉండేదని, ఇవాళ నెంబర్ వన్ స్థానంలో ఏదైనా ఉందంటే అది భారతదేశమే అన్నారు.ఇన్ని కోట్ల మంది మైనార్టీలు ఉన్న దేశంలో ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు,వేలాది కులాలు, మతాలు, వివిధ భాషలు ఉన్న భారతదేశంలో అందరం కలిసిమెలిసి ఉన్నామంటే ప్రధానమైన రాజ్యాంగం వల్లే అని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏ రాజ్యాంగం ప్రసాదించాడో, రాజ్యాంగాన్ని రూపొందించాడో, ఆ లౌక్య రాజ్యాంగం వల్ల ప్రజాస్వామ్యం ఏర్పడడం వల్ల మనందరం కూడా కలిసిమెలిసి ఉన్నామన్నారు.ఇవాల రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే పద్ధతుల్లో ప్రజాస్వామ్యాన్ని పాత్ర వేస్తున్నారన్నారు. లౌకికవాదాన్ని మట్టు పెడుతున్నారన్నారు.నరేంద్ర మోడీ, అమిత్ షా భారతీయ జనతా పార్టీ స్పష్టంగా అనుసరిస్తున్న విధానం బహిరంగంగా మతోన్మాదం రెచ్చగొడుతున్నారన్నారు. మైనార్టీలను బయోందానాలకు గురి చేస్తున్నారని మైనార్టీలకు, హిందువులకు తగాదాలు పెడుతున్నారని మండిపడ్డారు.మనందరం ఐక్యమత్తంగా మతసామరస్యంగా కులాల కుంపట్లు సరైనది కాదని పిలుపునిచ్చారు. కలిసిమెలిసి జీవించాలని దేశాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని తెలిపారు.దేశ సంపదంత కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని అన్నారు.అంబానీని, ఆదానిని మోడీ పెంచి పోషిస్తున్నాడని అన్నారు.ఇలాంటి తరుణంలో దేశాన్ని రక్షించుకునేందుకు ముందుకు రావాలని కోరారు.ఇలాంటి సమయంలో దేశాన్ని కాపాడుకునేందుకు మోడీకు హటావో దేశ్ కి బచావో అనే కార్యక్రమాన్ని సిపిఐ,సీపీఎం ఇతర కమ్యూనిస్టు పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.రాష్ట్రానికి సంబంధించి జగన్మోహన్ రెడ్డి పీకిందేంటని అన్నారు.ఎమ్మెల్యేలు ఎంపీలు చైర్మన్లు అంతా మీరే ఉన్నారని అన్నారు. మంచితనంగా కాలు మీద కాలేసుకుని రాష్ట్రాన్ని పరిపాలన చేయమంటే నువ్వు ఏం చేస్తున్నావని ప్రశ్నించారు.నెలలో ఒకటో తారీకువస్తే జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవు అన్నారు.అప్పు తెస్తే చాలు ఆ అప్పు పెన్షన్లు ఇస్తాడని లేదంటే పరిస్థితి ఎలా ఉందనేది స్పష్టంగా చూస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాష్ట్రన్ని దివాలా పట్టించాడని విమర్శించారు. ఏమయ్యా జగన్ ప్రజాస్వామ్యాన్ని ఏమైనా గౌరవిస్తున్నావా, ప్రతిపక్షాలనైనా, ప్రజాసంఘాలనైనా పట్టించుకున్నావా అని ప్రశ్నించారు. చివరికి మీ కుటుంబ సభ్యులను కూడా గందరగోళం చేశావని విమర్శించారు.రాష్ట్రాన్ని దివాలా చేయించావని ,ఈ రాష్ట్రాన్ని భవిష్యత్తు లేకుండా చేశావని మండిపడ్డారు. అన్నారు. జగన్మోహన్‌రెడ్డి స్టిక్కర్ బ్యాగులోకి వేసుకుని ఇంటింటికి షాపులకు వెళ్తున్నారని అన్నారు. ఎందుకు స్టిక్కర్ అతికిస్తున్నారని అంటే జగనన్నే మా నమ్మకము, జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారన్నారు. అయ్యా రాష్ట్రాన్ని దివాలా పట్టించిన ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి ఏ రకంగా భవిష్యత్తు ,ఏరకంగా నమ్మకం నిలబెట్టుకున్నారని చెప్పమని ప్రశ్నించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విదానాలనుంచి ఈ దేశాన్ని కాపాడుకునేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడేందుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఒక్కటే కాదని ఇరవై ఒక్క పార్టీలు కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వాన్ని 2024లో గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి, సహాయ కార్యదర్శి లు డోల శంకరరావు, కొమర భాస్కర రావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, డీహెచ్‌పీఎస్ నాయకులు బలగ రామారావు, రైతు సంఘం నాయకులు పంచిరెడ్డి అప్పారావు, సీపీఐ సభ్యులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక నిరంకుశ బిజెపిని ఓడించండి

- సిపిఐ, సిపిఎం నాయకులు సుందరలాల్, తులసీదాస్

విశాలాంధ్ర-పలాస : దేశాన్ని ప్రజా వ్యతిరేక విధానాలతో నిరంకుశంగా పాలిస్తున్న బిజెపిని ఓడించాలని రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని మోడిని గద్దె దించాలని సిపిఐ నాయకులు చాపర సుందరలాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల బి.తులసీదాస్‌లు పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ప్రచార భేరి కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం కాశీబుగ్గ సంత మైదానం వద్ద సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చును రాజేస్తుందని, మరోవైపు ఆదాని, అంబాని వంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతుందని అన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిని నిరంకుశంగా అణచివేస్తున్నారని, నాడు అనేకమంది త్యాగధనులు బ్రిటిష్ వలస పాలనను ఎదిరించి తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని, నేడు అదే స్వాతంత్ర్యం పెను ప్రమాదంలో పడిందని, అనాటి జాతీయ ఉద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. దేశ ప్రజల ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంక్‌లను ప్రజలు కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ పరిశ్రమలు, విశాఖ ఉక్కు పరిశ్రమను, వాడరేవులను, ఆఖరికి ప్రజలందరికీ అన్నం పెట్టే వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్లకు ధారదత్తం మోడి ప్రభుత్వం చేస్తుందని దుయ్యబట్టారు. ప్రధాని మోడి అండ దండలతో ఆదాని ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్ల రూపాయలు ఎలా కొల్లగొట్టారో హేడెన్‌బర్గ్ నివేదిక ఇటీవల బట్టబయలు చేసిందని గుర్తు చేశారు. దానిపై విచారణకు అంగీకరించకుండా ఆదానిని కేంద్ర ప్రభుత్వం వెనకేసుకొని వస్తుందని దుయ్యబట్టారు. దేశంలో గల అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతుందన్నారు. సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, సిపిఐ జిల్లా కార్యదర్శి గోవిందరావులు మాట్లాడుతూ పేదలకు సామాన్య ప్రజలకు అండగా ఉండకుండా వారు మోయలేనంత భారాలు మోడి ప్రభుత్వం మోపుతుందని, గ్యాస్, ఆయిల్, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల బ్రతుకుల్లో మంటలు రాజేస్తున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా పేదలకు విద్య, వైద్యం అందనంత ఖరీదైపోయి కార్పొరేట్ వ్యాపారంగా మారిపోయిందని, గ్రామీణ పేదలకు ప్రాణాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని మోడి ప్రభుత్వం అటకెక్కించిందని అన్నారు. జిల్లాలో గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) ఏర్పాటు చేయాలని, వంశధార నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పరిహారం చెల్లించాలని, అలాగే జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ప్రజల భూములను ఆక్రమించు కుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేకుంటే పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు పలాస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి సభాస్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సిపిఐ నాయకులు లండ వెంకటరావు, చాపర వేణుగోపాల్, మొజ్జాడ యుగంధర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, మద్దిల రమణ, సిపిఎం

నాయకులు గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, ఆర్.దిలీప్‌కుమార్, దుబ్బ భానుమతి, పి.సాంబమూర్తి, టి.భాస్కరరావు, దేవేంద్ర, డి.భాస్కరరావు లతోపాటు అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 265 కోట్లతో 5 మండలాలకు తాగునీరు

విశాలాంధ్ర-పాతపట్నం: నియోజకవర్గ పరిధిలోని హిరమండలం, పాతపట్నం, మెలియా పుట్టి, ఎల్.ఎన్ పేట, కొత్తూరు మండలాల్లోని గ్రామాల్లో సుమారు మూడున్నర లక్షల మందికి శాస్వత తాగునీటి ఎద్దడి తీర్చేందుకుగాను స్థానిక శాసన సభ్యురాలు రెడ్డి శాంతి విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 265 కోట్లతో వంశధార రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరా కొరకు మంజూరుచేసిన మంచినీటి పథకం పనులు త్వరితగతిన నిర్వహించేందుకు కార్యరూపం దాల్చుతున్నందున, పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తన కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తనతోపాటు నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస పురపాలక సంఘ పరిధి లోని నాలుగో వార్డ్ కనిమి వలస కూడలి వద్ద జనసేన నాయకుల ఆధ్వర్యంలో చలివేంద్రా న్ని ఏర్పాటు చేశారు. ఓయోడెక్ట్ కూడలిలో జనసేన పట్టణ ప్రతినిధి రాంబాబు ఆధ్వ ర్యంలో మజ్జిగ, కర్బుజా ముక్కలను అందించారు. అటు నరసన్నపేట, ఇటు మెట్టక్కి వలస, గేదెలవాని పేట, బమ్మిడి వాని పేట, ఊసవాని పేట, ఇటు ఆమదాలవలసకు వచ్చే కోడలి కావడంతో చలి వేంద్రానికి ప్రాముఖ్యత సంతరించు కుంది. జనసేన నాయకులు ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ చలివేంద్రాన్ని ప్రతిరోజు మజ్జిగ అందిస్తామని, అలాగే దాతలు పెరిగిన కొలది ఫ్రూట్ జ్యూస్ కూడా అందిస్తామని నిర్వా హకులు వివరించారు.

జగన్ ప్రభుత్వ హయాంలో 'పేట' అభివృద్ధి

జెడ్పీటీసీ డా.ధర్మాన కృష్ణచైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట : ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి హాయాంలో నరసన్నపేట అభివృద్ధి జరిగిందని పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. శనివారం పట్టణంలో ఆయన స్థానిక వైఎస్ఆర్ జంక్షన్ సమీపంలో వున్న మారుతీనగర్-1 వీధి మెయిన్‌రోడ్ విస్తరణ పనులు రూ.31లక్షల నిధులతో మంజూరు చేయించి, శంఖుస్థాపన చేశారు. అలాగే బజారు వీధిలో కూరగాయల మార్కెట్ ఆధునీకరణకు రూ.10లక్షలుతో శంఖుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి ప్రహరీకి రూ.5లక్షలుతో శంఖుస్థాపన చేశారు. సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగింపు సంధర్భంగా మెగా బైక్ ర్యాలీ వైసిపి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైసిపి ప్రతినిధులు, చింతు రామారావు, పొన్నాన దాలినాయుడు,పాగోటి రాజారావు, పొట్నూరు కృష్ణప్రసాద్, వైశ్యరాజు కేశవరాజు, పొట్నూరు సాయి ప్రసాద్, రఘుపాత్రుని శ్రీధర్, అవ్వ రవీంద్రరెడ్డి, గనగళ్ళ వేంకట శ్రీనివాసరావు, నేతింటి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి సర్వత్రా మద్దతు : చైర్‌పర్సన్ పిరియా విజయ

విశాలాంధ్ర-సోంపేట : రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వానికి ప్రజలంతా సర్వత్రా మద్దతు పలుకుతున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పేర్కొన్నారు. ఈ మండలం బేసిరామచంద్రా పురంలో శనివారంతో పూర్తయిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వే ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో కోటి 45లక్షల కుటుంబాలను కలుసుకోవడం జరిగిందని, ఇందులో కోటి 10 లక్షల మంది మిస్డ్ కాల్స్ ద్వారా ప్రభుత్వానికి మద్దతు పలికారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, అన్ని వర్గాల ప్రజలు రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ డి.లోకేశ్వరరెడ్డి, సోంపేట, కంచిలి ఎంపీటీసీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాసురెడ్డి, సర్పంచ్ ప్రతినిధి బుద్దాన శ్రీకృష్ణ, కర్తలిపాలెం సర్పంచ్ పొందూరు గున్నయ్య, బీన ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాన్ని కూన రవికుమార్ పరామర్శ

విశాలాంధ్ర-పొందూరు : కింతలి గ్రామ మాజీ సర్పంచ్ పైడినర్సు నాయుడు, కనిమెట్ట పంచాయతీ రాందాస్ పురానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన పలు సానుభూతిపరుల కుటుంబాలకు మాజీ ప్రభుత్వ విప్, జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. కింతలి సర్పంచ్ రామ్ ప్రసాదరావు తండ్రి మృతికి కూన విచారం వ్యక్తం చేశారు. అందరితో మమేకమై సమస్యల సాధనకు ఎనలేని కృషిచేసిన ఓ మంచి నాయకుడిని కోల్పోవడం దురదృష్టం గా భావించారు. పంచాయితీ ప్రజలకు అందుబాటులో నీతి నిజాయితీగా ముక్కు సూటిగా మాట్లాడే మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమన్నారు. తమ గ్రామమే తమ కుటుంబం గా భావించి సేవ లందించిన నర్సు నాయుడు మృతి పార్టీకి తీవ్ర లోటుగా భావించారు. ఇంటికి పెద్దతరం కూల్పోయిన కుటుంబానికి ధైర్యసహసాన్నికల్పించారు.తండ్రి ఆశయ సాధనలోతనయుడు ప్రస్తుత సర్పంచ్ రాంప్రసాదరావు నిలవాలని ఆయనకి భుజం తట్టిధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మే 10న పాతపట్నంలో చంద్రబాబు పర్యటన

విశాలాంధ్ర-కొత్తూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజి సీఎం చంద్రబాబు నాయుడు మే 10 తేదీన ఉత్తరాంధ్రలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి పర్యటనలో భాగంగా ముందుగా పాతపట్నం నియోజకవర్గంలో పర్యటించనున్నారు మే 10 తేదీ నుండి మే 19వ తేదీ వరకు చంద్రబాబునాయుడు రోడ్‌షో, బహిరంగ సభలను నిర్వహించ నున్నారని ఇక్కడ ఆ పార్టీ వర్గాలకు సమాచారం శనివారం అందింధని ఆ పార్టీ పాతపట్నం ముఖ్య నేత ఒకరు మీడియాకు తెలిపారు. 11న పాలకొండలో పర్యటన కాగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 10 తేదీన పాతపట్నం నియోజకవర్గంలో పర్యటన అనంతరం 11వ తేదీన పాలకొండ నియోజకవర్గంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహిస్తారన్నది తాత్కాలిక షెడ్యూల్ అని టీడీపీ పాతపట్నం నేత తెలిపారు.

కొత్తూరు మీదుగా బాబు రోడ్ షో? కాగా మే 10వ తేదీన పాతపట్నంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటన అనంతరం ఆయన 11వ తేదీన పాలకొండ నియోజకవర్గం లో పర్యటించనున్నారు. అయితే ఆయన పాలకొండ చేరుకోవాలంటే మాతల నివగాం వంశధార నది వంతెన మీదుగా నాలుగు రోడ్లు కూడలి కొత్తూరు మీదుగా పాలకొండ చేరుకోవలసి ఉంది. ఎందుకంటే సెంటిమెంట్ దృష్ట్యా బాబు హిరమండలం గొట్టా బెరేజ్ మీదుగా పాలకొండ చేరే అవకాశాలు తక్కువ ఈ నేపథ్యంలో టీడీపి అధినేత చంద్రబాబునాయుడు మాతల నివగాం వంశధార వంతెన మీదుగా (వయా కొత్తూరు) పాలకొండ పర్యటనకు బాబు చేరుకొనే అవకాశాలున్నాయని ఆ పార్టీ ముఖ్యనేత విశాలాంధ్రకు తెలిపారు. అయితే బాబు పర్యటన పూర్తి షెడ్యూల్ వస్తే గాని పాలకొండ ఎలా వెళ్తారన్నది తెలియదని స్థానిక టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

175 స్థానాల్లో 'టిడిపి'కి అభ్యర్థులను పెట్టే దమ్ముందా?

- కోట్లాది జనం గుండెల్లో 'జగన్' స్థానం సుస్థిరం
- మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులను పెట్టి, పోటీ చేసే దమ్ము చంద్రబాబునాయుడుకు వుందా అని, మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్ ప్రశ్నించారు. జగనన్నే మాభవిష్యత్తు విజయవంత మైన కారణంగా స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి, కృష్ణదాస్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళ సంక్షేమ, అభివృద్ధి పరిపాలనలో కోట్లాది జనం గుండెల్లో సిఎం, జగన్మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని తెలిపారు. ఈనెల 7వ తేదీన వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించిందని, 7లక్షల మంది పార్టీ సైనికులు ప్రతీ ఇంటిని సందర్శించారని అన్నారు. సర్వే ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకూ రాష్ట్రంలో 1.45కోట్ల కుటుంబాలు పాల్గొన్నాయని, ప్రభుత్వానికి మద్దతుగా 1.1 కోట్లకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. క్షేత్ర స్థాయిలో వైసిపి క్యాడర్ నిబద్ధత, పట్టుదలతో పనిచేసి ఈసర్వేను పారదర్శకంగా నిర్వహించారని, ప్రస్తుతం 'రాష్ట్రంలో మా నమ్మకం నువ్వే జగనన్న' నినాదం మారుమ్రోగుతోందని తెలిపారు. మెగా పీపుల్స్ సర్వే ఫలితాలు విపక్షాలకు షాక్ ఇచ్చాయని, ప్రతిపక్షాల కంచుకోటగా వున్న ప్రాంతాల్లో కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో వైసిపికి మద్దతుగా నిలిచారని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డిపై రాష్ట్ర ప్రజలు తమ నమ్మకాన్ని స్వచ్ఛందంగా తెలిపినందుకు కృష్ణదాస్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్, కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య, మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు, వైసిపి నాయకులు, చింతు రామారావు, సురంగి నర్సింగరావు, పాగోటి రాజారావు, ధర్మాన జగన్మోహన్‌రావు, వాన గోపి, కణితి కృష్ణారావు, శ్యామలరావు, వైశ్యరాజు కేశవ రాజు, నేతింటి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గుంటూరులో జిల్లాకు చెందిన మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర-జలుమూరు : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు దాచేపల్లిలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం శిరగాంకు చెందిన హరిదాసు, స్రవంతి దంపతులకు ఇద్దరు సంతానం. ఉద్యోగరీత్యా 6 నెలలుగా ఈ కుటుంబం దాచేపల్లిలో నివాస ముంటోంది శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని స్రవంతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బిలాలుద్దీన్ తెలిపారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న' విజయవంతం : ఎమ్మెల్యే



విశాలాంధ్ర-పాతపట్నం : నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక శాసన సభ్యురాలు వారి క్యాంపు కార్యాలయం నందు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జగనన్నే మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం పై ప్రెస్ మీట్ నిర్వహించి, "మా నమ్మకం నువ్వే జగన్" అనే కార్యక్రమం ప్రారంభించి 22 రోజులు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రూ. 1 కోటి 45 లక్షల ఇళ్ళల్లో నిర్వహించిన ఈ మెగా పీపుల్ సర్వే కార్యక్రమంలో 8296082960 ఫోన్ నెంబర్ కి 1కోటి 10లక్షల మిస్డ్ కాల్స్ రావటం అలాగే పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని 5మండలలో 91 సచివాయాల పరిధిలో 85 వేల ఇళ్ళల్లో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో 50 వేల ఫోన్ కాల్స్ వచ్చాయని పలు గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం" నిర్వహిస్తున్నప్పుడు జగనన్న సంక్షేమ పాలనపై ప్రజల నుండి వచ్చిన మహోన్నత స్పందన, విశేష ప్రజాదరణను లభించిందని మెగా పిపుల్స్ సర్వేలో ప్రజలు బ్రహ్మరథం పట్టటం బహుశ భారతదేశ చరిత్రలో ఏరాష్ట్రంలో కూడా జరిగి ఉండదని, వచ్చే ఎన్ని కల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటా మని చెప్పటం జగన్ మోహన్ రెడ్డి పరిపాలన దక్షతకు తార్కానమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు ఇలాంటి సంక్షేమ పాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో శ్రీనీలమణి దుర్గ అమ్మవారి ఆశీస్సులతో పాతపట్నం నియోజక వర్గం ప్రజలకు సేవ చేసే భాగ్యం నాకు కలగడం నా పూర్వ జన్మ సుకృతం అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు.కార్యక్రమానికి సహకరించిన వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యులకు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ధన్యవాదములు తెలియచేశారు.

జెఇఇ మెయిన్స్‌లో సత్తాచాటిన నారాయణ విద్యార్థులు

విశాలాంధ్ర-పలాస : అఖిలభారత స్థాయిలో నిర్వహించిన జెఇఇ మెయిన్స్‌లో విశాఖ నారాయణ కళాశాలలో చదువుకుంటున్న పలాస కాశీబుగ్గకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. శనివారం విడుదల చేసిన జెఇఇ ఫలితాల్లో కాశీబుగ్గకు సుగ్గు ప్రేమ్‌కుమార్ ఓపెన్ కేటగిరి 2571 (467), గుంట సంతోష్ భార్గవ్ 4558 (913), శాసనపురి అఖిల్ 6157 (801) ఎతిరాజుల సాయి సంకేత్ 14185 (3312) ర్యాంక్‌లు సాధించారు. వీరిని నారాయణ కళాశాల ఎ.జి.ఎం బమ్మిడి నారాయణ, సిబ్బంది అభినందించారు.

ఇంటిగ్రిటీ శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర-టెక్కలి : స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు శనివారం ఇంటిగ్రిటీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల టీడీపీ అధ్యక్షులుకు, క్లస్టర్ ఇంఛార్జిలకు, యూనిట్ ఇంఛార్జిలకు, బూత్ కన్వీనర్లకు, బూత్ ఇంఛార్జిలుక ముఖ్య నాయకులుకు, నాలుగు మండలాల సోషల్ మీడియా ఇన్చార్జుల కార్యకలాపాలపై దిశానిర్దేశం చేశారు.సోషల్ మీడియా ద్వారా పార్టీని పటిష్ఠంగా చేయాలని సూచించారు. హౌస్ మ్యాపింగ్ కార్యక్రమం వేగవంతం చేయాలి అని దిశ నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ టి ఎస్ పార్లమెంట్ కోర్డనేటర్ ఊన సంతోష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు లోడగల కృష్ణారావు, జిల్లా టెలిగ్రామ్ బాట్ ట్రైనర్ మోహన్ కృష్ణ,ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు ప్రధానుల విజయరాం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడే విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-పొందూరు : విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కారణంగా పొందూరు, లోలుగు ఇండస్ట్రియల్ పిడర్ల పరిధిలో ఆదివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడు తుందని విద్యుత్తు శాఖ ఈ బయ్యన్నయుడు తెలిపారు. వినియోగదారుల ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

180 మద్యం సీసాలు స్వాధీనం... వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాలి పోలీస్ స్టేషన్ పరిధిలో, సంతబొమ్మలి పాలేశ్వరం ఆలయం వద్ద పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా, 180 మద్యం సీసాలు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో లింగుడు పంచాయతీ ఎం సున్నా పెల్లి గ్రామానికి చెందిన అర్జాల ఈశ్వరరావు వాహనం తనిఖీ చేస్తున్న సమయంలో, అక్రమంగా తరలిస్తున్న 180 మద్యం బాటిల్ లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్య : ఎమ్మెల్సీ నర్తు



విశాలాంధ్ర-కవిటి : కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈమేరకు శనివారం మండలంలోని రాజపురం మోడల్ స్కూల్‌లో యాన్యువల్ డే సెలబ్రేషన్ లో ఎమ్మెల్సీ నర్తు రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ పేద ధనిక తారతమ్యం లేకుండా విద్యార్థులందరికీ సమన్యాయం పాటించి ఉన్నత విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు.ప్రతి విద్యార్థి మానసిక ఒత్తిడికి గురికాకుండా చదువుపై దృష్టి సారించి మంచి మార్కులు కైవసం చేసుకుని ఉత్తమ పౌరులుగా సమాజంలో గుర్తింపు పొందాలని అన్నారు.అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల పద్మ ప్రకాష్, మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, సర్పంచ్ సనపల జానకిరావు,ఒరియా మైనారిటీ సంఘ అధ్యక్షులు సత్యనారాయణ పాడి, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, లీకల్ సెల్ కన్వీనర్ పులకల శ్రీరాములు, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మాడెం ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని హంగులతో లబ్ధిదారులకు గృహాలందజేత

-1280 టిడ్కో గృహాలు రూ.105.62 కోట్లతో నిర్మాణం
- మరో 12 వేల గృహాలు నిర్మాణం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : గృహాలు నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా 3వ స్థానంలో ఉందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం వై.యస్.ఆర్. జగనన్న నగర్ పిఎంఏవై (అర్బన్) పాత్రునివలసలో లబ్ధిదారులకు అందించు ఎపి టిడ్కో గృహ సముదాయం ప్రారంభోత్సవంలో ఆయనతోపాటు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ చిత్తూరు శ్రీధర్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రునివలసలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తి స్థాయిలో కాలువలు, విద్యుత్, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో నివాస యోగ్యత కలిగిన గృహాలను లబ్ధిదారులకు గృహాలు అందించినట్లు వివరించారు. పెద్దపాడు, పాత్రునివలస, చాపరాం, కిల్లిపాలెం, తదితర గ్రామాలకు ఒక పెద్ద ప్రాజెక్టు ఏర్పాటుచేసి 24 గంటల విద్యుత్ ఉండే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. పాత్రునివలస, పొన్నాడ, తదితర గ్రామంలో మరో 12 వేల గృహాలు నిర్మిస్తామన్నారు. గృహ నిర్మాణాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 3వ స్థానంలో ఉందన్నారు. లబ్ధిదారులకు నిష్పక్షపాతంగా లాటరీ పద్ధతిలో గృహాలు కేటాయించినట్లు స్పష్టం చేశారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ లో పాత్రునివలసలో 1280 ఫ్లాట్లు ప్రాజెక్టు విలువ రూ.105.62 కోట్లుతో నిర్మించినట్లు వెల్లడించారు. పాత్రునివలసలో మొత్తం 1280 ఫ్లాట్లకు (300 చ. అ. - 480, 365 చ. అ. 192, 430 చ. అ. 608) వాటి విలువ రూ.78.43 కోట్లని వివరించారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ప్రతీ పేదవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశమన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పాత్రునివలస లో 1280 ఫ్లాట్లును రూ.105.62 కోట్లతో రూపాయలతో నిర్మించినట్లు వెల్లడించారు. పాత్రునివలసలో 40 బ్లాకులతో మొత్తం 1280 ఫ్లాట్లకు (300 చ. అ. - 480, 365 చ. అ. 192 మరియు 430 చ. అ. 608) వాటి విలువ రూ.78.43 కోట్లని పేర్కొన్నారు. గృహాలు లబ్ధిదారుల పేరుతో ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. గృహాలు పూర్తి స్థాయిలో నిర్మించి, మురుగు నీరు శుభ్రం చేసే యంత్రం, 5 లక్షలు లీటర్ల కెపాసిటీ గల నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అద్దె ఇంట్లో ఉన్న వారు వచ్చేనెల నుండి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ ప్రాంతంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. గృహాలన్ని మహిళలు పేరున రిజిస్ట్రేషన్ జరిగినట్లు వివరించారు. టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసాద్ మాట్లాడుతూ టిడ్కో గృహాలు 24 పట్టణాలలో పూర్తి చేయగా శ్రీకాకుళం 25 పట్టణంగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు 50 వేల గృహాలు లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. ఎపి టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ చిత్తూరు శ్రీధర్

మాట్లాడుతూ పాత్రునివలస టిడ్కో గృహాలుకు 5 కిలో మీటర్ల నుండి నాగావళి నది నుంచి తాగు నీరు తీసుకువచ్చేందుకు 16 కోట్లు రూపాయలు వెచ్చించినట్లు వివరించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ టిడ్కో గృహాలు పూర్తి స్థాయిలో పూర్తి చేసి నివాస యోగ్యత కలిగిన గృహాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారిగా, జిల్లా కలెక్టర్‌గా ఉంటూ లబ్ధిదారులకు గృహాలు అందించడం వలన చాలా సంతోషంగా ఉందన్నారు. గృహాల నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా 3వ స్థానంలో ఉందన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల జిల్లాకు 74 వేలు మంజూరైనట్లు వెల్లడించారు. కాపు కార్పొరేషన్ అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, కళింగ కోమటి కార్పొరేషన్ అధ్యక్షులు అందవరపు సూరిబాబు, బాణాల గాంధీ, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పైడిశెట్టి జయంతి, పద్మావతి మాట్లాడుతూ అన్ని హంగులతో పూర్తి స్థాయిలో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు, ఇళ్లకు సంబంధించిన పత్రాలను అందజేశారు. టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించు కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, మెప్మా పిడి కిరణ్ కుమార్, హౌసింగ్ పీడీ గణపతిరావు, టిడ్కో అధికారులు, మెప్మా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

పేదల ఇంటి కలను సాకారం చేశాం : టిడ్కో ఇళ్ల పంపిణీలో రెవెన్యూ మంత్రి ధర్మాన

పాత్రునివలస టిడ్కో ఇల్లు పంపిణీలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ఇల్లు పొందుతున్నవేళ శుభాకాంక్షలు. ఇల్లు పొందడం అన్నది చిన్న విషయం కాదని, మా జిల్లా నుంచి దేశంలో ఏ పేద పట్టణానికి వెళ్లినా మా వాళ్లే ఉంటారు. తాపీ పని చేసేవారు,హెూటళ్లలో పనిచేసేవారు, తినుబండారాలు అమ్మేవారు కనిపిస్తారు. ఇల్లు లేక చిన్నచిన్న ఆవాసాల్లో జీవించిన వారు. అలాంటి జీవన పరిస్థితులు వీరివి. దీనికి భూమి నేను మంత్రిగా ఉన్నప్పుడు కొనుగోలు చేశాను. ఆ రోజు పాత్రునివలస గ్రామస్థులు భూమి ఇవ్వం అని చెప్పారు. ఎందుకంటే టౌన్ పక్కన ఉన్న భూమిని ఇచ్చేందుకు ఎవ్వరూ ఇష్టపడరు. ల్యాండ్ వాల్యూ అంతకంతకూ పెరుగుతూ వస్తుంది కనుక వారంతా ఒకప్పుడు భూమి ఇచ్చేందుకు టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అడ్డు చెప్పారు. లబ్ధిదారుల సమస్యలను అర్థం చేసుకుని భూమి ఇవ్వాలని నేను కోరగా ఆ రోజు భూమి ఇచ్చేందుకు అంగీకారం చెప్పారు. పాత్రునివలసలో టిడ్కో ఇళ్ళ పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడుతూ సుఖంగా కుటుంబం జీవించేందుకు సౌకర్యాలు కల్పించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. ఇవాళ పట్టణంలో పదిహేను వేల మందికి ఇల్లు ఇవ్వామని తెలిపారు. అభివృద్ధిలో గత ప్రభుత్వానికీ ఈ ప్రభుత్వానికీ ఎంతో తేడా ఉందన్నారు. మీరు అసత్య ప్రచారాలు నమ్మవద్దని, పేపర్లు, మీడియా చూసి మీరు ఓ తప్పుడు అభిప్రాయానికి రావొద్దని, ఇంట్లో ఉండి విమర్శలు చేయడం తగదని అన్నారు. ప్రతి నెలా అమలు అవుతున్న పథకాలు వాటి ద్వారా అందించే డబ్బు ఎక్కడిదని, ఇది కూడా మీరు తెలుసుకోవాలని ఈ ఇళ్ల నిర్మాణాల పూర్తికి మౌలిక వసతుల కల్పనకు టిడ్కో చైర్మన్ ప్రసన్న చాలా కష్టపడ్డారని అన్నారు. మంత్రి ఆదిమూలపు సురేశ్ బాగా చదువుకున్న వారని, ఆయన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ నుంచి ప్రజా జీవితంలోకి వచ్చినవారని అన్నారు. మీరంతా ఆదర్శంగా ఉండాలని, మీ ఆలోచనలు

తప్పుగా ఉండకూడదని, ఓటు అన్నది మీ ఇష్టమని మంత్రి ధర్మాన పేర్కొన్నారు. అనంతరం మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ఆదిమూలపు సురేష్‌లు ఇళ్ళ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీ శ్రీకేష్ బి లత్కర్, టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్, చైర్మన్ ప్రసన్న కుమార్, ఇతర కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, అందవరపు, సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మెంటాడ పద్మావతి, పైడి శెట్టి జయంతి తదితరులు పాల్గొన్నారు.

వై.ఎస్.ఆర్ జగనన్న బడుగు వికాసానికి దరఖాస్తులు స్వీకారం

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.సుధాకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం స్పెషల్ ప్యాకేజీ క్రింద పరిశ్రమలు స్థాపించాలనుకునే ఆసక్తి గల ఎస్.సి.,ఎస్.టి అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.సుధాకర్ పేర్కొన్నారు. పరిశ్రమలతో పాటు సేవా రంగంలో ఆసక్తి గల అభ్యర్థులు కూడా తమని సంప్రదించవచ్చని పిలుపు నిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. ఈ పాలసీ ద్వారా స్థిర పెట్టుబడుల్లో రూ.1.20 కోట్ల మించకుండా 45శాతం రాయితీ కల్పించబడుతుందన్నారు. రూ.50 లక్షలకు మించకుండా ఐదేళ్ల వరకు 9 శాతం వడ్డీ రాయితీ ఉంటుందన్నారు. సేల్స్ టాక్స్ నందు (ఎస్‌జీఎస్‌టీ) నుండి శత శాతం ఐదేళ్ల వరకు తిరిగి చెల్లింపు ఉంటుందని తెలిపారు. భూమి ధరలో రూ.20 లక్షలకు మించకుండా 50 శాతం రాయితీని, స్టాంప్ డ్యూటీ క్రింద శత శాతం తిరిగి చెల్లించడం జరుగుతుందని అన్నారు. వీటితో పాటు ల్యాండ్ కన్వర్షన్ చార్జీలలో రూ.10 లక్షలకు మించకుండా 25 శాతం రాయితీ, కరెంటు చార్జీలలో యూనిట్ కు రూ.1.50 చొప్పున ఐదేళ్ల వరకు తిరిగి చెల్లింపు చేయబడుతుందని తెలిపారు. టెక్నాలజీ అప్ గ్రేడేషన్ కొరకు రూ.25 లక్షలకు మించకుండా 50 శాతం రాయితీ కల్పించ బడనుందని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. కార్లు, టిప్పర్లు, బస్సులు మొదలగు రవాణా వాహనాల స్థిర పెట్టుబడిలో రూ. 75 లక్షల వరకు రాయితీ (45 శాతం) ఇవ్వబడుతుందని తెలిపారు. కావున ఆసక్తి గల ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌ని సంప్రదించి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

'రైతన్నల సంక్షేమం కోసం అహర్నిశలు సీఎం శ్రమిస్తున్నారు

విశాలాంధ్ర-జలుమూరు : రైతన్నల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. జలుమూరు మండలం అల్లాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా ఎం శ్యామలరావు ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు 90పైసలు వడ్డీకే అందించి అన్ని విధాల ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎరువులు, విత్తనాలు, కోత మిషన్‌లు, ట్రాక్టర్‌లు 40శాతం సబ్సిడీకే అందిస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, తంగి మురళి, టి. సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పలాస: గిరిజన భూములను ఆక్రమించుకునేందుకు గిరిజనేతరులు ప్రయత్నిస్తున్నా రని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దమడి గిరిజనులు కోరారు. ఈ మేరకు శనివారం కాశీబుగ్గలో సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.తులసీదాసు లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామానికి చెందిన గిరిజన రైతులు నందవా రెవిన్యూ పరిధిలో 64/2ఎ, 65/2, 68/1, 68/3ఎ సర్వే నెంబర్లులో భూములను తరతరాలుగా సాగుచేస్తూ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమ భూములపై ఇతరులు దొంగ పట్టాలు సృష్టించి ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సిపిఐ, సిపిఎం నాయకులు స్పందిస్తూ గిరిజనులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని, వారికి న్యాయం జరిగే వరకు పోరాతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు మోహనరావు, గణపతిలు ఉన్నారు.

మంత్రి ధర్మానకు వినతి అందజేత

విశాలాంధ్ర-జలుమూరు : తిమ్మాడలో గుడియా మైనార్టీ మహిళ అమ్మన్నసాహుకు ఆమె టీషాపు భూమి విషయమై న్యాయం చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన తర్వాత ఒరియా మైనార్టీ సంఘం అధ్యక్షులు సత్యన్నారాయణ పాడి, గుడియా కుల జిల్లా అధ్యక్షులు లక్ష్మినారాయణ సాహు తదితరులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులతో చర్చిస్తామని ధర్మాన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కవిటి: కంచిలి మండలం కేంద్రంలోని శ్రీ విజ్ఞాన్ ప్రైవేట్ పాఠశాలలో శనివారం వార్షికోత్సవ, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆదినారాయణ, ప్రిన్సిపల్ ఉమా తదితరులు మాట్లాడుతూ అందరికీ అందు బాటులో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పాఠశాలను నిర్వహిస్తున్న మన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న జడ్పిటిసి ఇప్పిలి లాలాక్షి ఎంపీపీ దేవదాసు రెడ్డి ఎంఈఓ శివరాం ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ విజ్ఞాన్ పాఠశాల అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో కొల్లి ఈశ్వరరావు, పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా ప్రామాణిక పత్రాలు అందజేత

విశాలాంధ్ర-కవిటి : విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు విద్య ప్రామాణిక పత్రాలు అందజేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యా యుల అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగతి గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, స్థానిక సర్పంచ్ పూడి వరప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా ప్రామాణిక పత్రాలు అందజేశారు. మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ ఎస్సీ నారాయణస్వామి చేతులమీదుగా విద్యార్థులకు విద్యా ప్రామాణికపత్రాలు అందజేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన గ్రంథాలయాలు విద్యార్థులు వినియోగించు కోవాలని,సెలవు దినాల్లో గ్రంథాలయాల్లో పుస్తకాలు విద్యార్థులు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. తద్వారా విద్యార్థులు మేధస్సును పరీక్షించేందుకు ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారుఈ కార్యక్రమంలో జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్జునుడు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి,ఉపాధ్యాయులు బొడ్డ జయరాం, గ్రామ పెద్దలు పూడి వెంకటేశ్వరరావు, పిసి కమిటీ చైర్మన్ భావన నూకరాజు, భావనకుసురాజు, డి బాబురావు, భావన సీతారామ్మూర్తినాయుడు, భావన గోపాలకృష్ణ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి కూచిపూడి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటకు చెందిన నటరాజ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి నెల రోజుల పాటు ఉచిత కూచిపూడి శిక్షణ ఇవ్వనున్నట్లు నాట్య గురువు బిందు మాధవి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు శిక్షణ కొరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వర్క్‌షాప్ నిర్వహించి పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర-పోలాకి : ఇటీవల చాలెంజ్ కార్యక్రమంలో బగ్గుమన్న మాజీ ఎమ్మెల్యే అసౌకర్యంగా ఉన్న రోడ్డును తారు రోడ్డుగా ఏర్పాటు చేయాలని పలు

గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలో గల ప్రియగ్రహారం పంచాయతీ నుండి కాకినాడపేట మీదుగా రహిమాన్ పురం బార్జిపాడు వరకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వహయాంలో చేపట్టిన అభివృద్ధి పనులనులో భాగంగా పోలాకి మండలం ఆర్ అండ్ బి రోడ్ తెల్లవాని పేట, కాకినాడు పేట, రెహమాన్ పురం, భార్జిపాడు కొరకు రోడ్డు నిర్మాణంలో భాగంగా 2018 సంవత్సరంలో సుమారు 2.88 (లక్షల రూపాయిలతో) పనులు ప్రారంభించి సుమారు 60%పనులు పూర్తిచేసినప్పటికి ప్రభుత్వం మారిన తర్వాత వైస్సార్సీపీ ప్రభుత్వం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినప్పటికీ నేటికీ రోడ్డు పూర్తి చెయ్యకపోవడం పట్ల ఇటీవల మాజీ ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమంలో ఆరోపించారు. ఈ దుస్థితి పట్ల పూర్తిగా ప్రభుత్వం వైఫల్యమని తన చాలంజ్ లో చెప్పారు. రోడ్డు నిర్మాణం చేయకపోవడం పట్ల ఆయా గ్రామస్తులు అసౌకర్యం కి గురవుతున్నారు కావున ప్రభుత్వం స్పందించి ఎప్పటికైనా సక్రమమైన రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్'

విశాలాంధ్ర-రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ 'జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్' ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో చెప్పినట్లుగా ఈ రోజు జగనన్నే మా భవిష్యత్తు మెగా సర్వే తుదిఫలితాలను మీ ముందు ప్రకటిస్తున్నామని, సర్వే ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు ఈ కార్యక్రమంలో 1.45 కోట్లకుటుంబాలు పాల్గొన్నాయన్నారు. జగనన్న ప్రభుత్వా నికిమద్దతుగా 1.1 కోట్లకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని ప్రకటించడానికిమేము గర్విస్తున్నా మన్నారు. ఏపీ ప్రజలు సీఎం జగనన్న ప్రభుత్వానికి చూపిన మద్దతు చారిత్రాత్మకమేకాక, ప్రజలు స్వచ్ఛందంగా వారిఅభిప్రాయాలు వ్యక్తం చేసిన గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జే.సి.యస్ ఇంచార్జుచిల్ల వెంకటరెడ్డి, గృహ సారథులు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేమీ ఖర్మ మన రాష్ట్రానికంటూ సర్కారు తీరుపై టిడిపి గర్జన

విశాలాంధ్ర-పొందూరు : పేదల ఖర్మ గాలి ఆంధ్రప్రదేశ్ పాలించదానికి సైకోను గెలిపించినందుకు ప్రత్యక్షపం పడిన దగాపడ్డ ప్రజల ముందు ఆమదాలవలస నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్ సారాధ్యంలో లైదాం, కొల్లిపేట, పొందూరు రైల్వే స్టేషన్ లుట్టపేట యాగాడపేట గ్రామంలోఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంత నలుమూలల నుండి కథలు వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులుఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే పే కార్డును చేతభూని పురవీధుల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి పట్ల హెూరెత్తిన నినాదాలు చేశారు. రాష్ట్రంలో హిట్లర్ రాజ్యాన్ని తలపించే విధంగా జగన్మోహన్ రెడ్డి పాలనతో ప్రజల పడుతున్న అవస్థలను ఇంటింటా తిరిగి విపులంగా తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలను అంతం చేసే దశగా అందరం కలిసి పని చేయాలని రవికుమార్ కోరారు. దగాకోరు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ ఐక్యరాగం పాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోజిల్లా ఈ తెలుగు యువత సంయుక్త కార్యదర్శిబలగ శంకర భాస్కర్, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులు సి పొన శ్రీరంగనాయకులు, జిల్లా పార్లమెంటరీ పార్టీ నేత చింతాడ కృష్ణ వాసుదేవరావు, మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, పొందూరు ఎంపీటీసీ ఫోర్ ప్రతినిధి బాడాన శేషగిరి నాయుడు, మండల పార్టీ కార్యదర్శి వండాన మురళీకృష్ణ, కొంచాడ మాజీ సర్పంచ్ ముగడ తవిటి నాయుడు, లైదాం సర్పంచ్ అనంత రామకృష్ణ, బొడ్డేపల్లి సత్యం, మండల నలుమూల నుండి కదలి వచ్చిన టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమస్యలపై సభాపతితో మంత్రి ఆదిమూలపు రివ్యూ

మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో గృహాలను పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఏపీ రాష్ట్ర మున్సిపల్,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శ్రీకాకుళం జిల్లాలో శనివారం పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడ్కో ఇండ్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆముదాలవలసలోగల సభాపతి నివాసానికి చేరుకున్నారు. మంత్రికి స్పీకర్ తమ్మి నేని సీతారాం స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి ఆముదాలవలస నియోజక వర్గంలో చేపట్టిన పనులు పై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఇళ్ల నిర్మాణ పనులను దక్కించుకున్న గుత్తే దారులు సకాలానికి పనులు పూర్తి చేయా లని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో గృహాల మంజూరు, ఇప్పటివరకు చేపట్టిన పనులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యానికి మిగిలిన పనులు పూర్తి చేయాల్సిందేనని మంత్రి తేల్చి చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో గల సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి,వాటి పరిష్కా రానికి బాధ్యతాయుతంగా చొరవ చూపాలని ఆదేశించారు.వేసవి కాలం దృష్ట్యా త్రాగునీటి సరఫరా విషయంలో అప్రమత్తంగా ఉండా లని సూచించారు. వంశధార,నాగావళి నదులు నుండి నీటిని అప్లిఫ్ట్ ద్వారా పట్టణ ప్రజలకు అందించే ఉద్దేశంతో చేపట్టిన భారీ రక్షిత మంచినీటి పథకం పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. 67 కోట్ల అంచనాలతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకాన్ని వీలు న్నంత తొందరగా పూర్తి చేయాలని కోరారు. నిరంతరంగా త్రాగునీరు అందించి పట్టణ ప్రజలకు ఎటువంటి తాగునీటి ఎద్దడి తలె త్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో తిట్కో చైర్మన్ ప్రసన్న కుమార్, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వార్డు సచివాల యాల కోఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహే శ్వరరావు, పొన్నాడ చిన్నారావు, మామిడి రమేష్, పొదిలాపు తిరుపతి, సంపత్ రావు రామారావు తదితర వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులో మెరిసిన ఆణిముత్యాలు

విశాలాంధ్ర - నరసన్నపేట (సరుబుజ్జిలి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలి అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ (ఒకేషనల్ కోర్సు) విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 500 మార్కులకు గాను కూరాకుల మహేష్ 460 మార్కులు సాధించి కళాశాల టాపర్ గా నిలిచాడని తెలిపారు. సవర రాజు 447 మార్కులు, సాకేటి హైమావతి 426 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని అన్నారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సవర రీతా 1000 మార్కులకు గాను 878 మార్కులు సాధించందనీ తెలిపారు. వీరంతా పేద కుటుంబాలకు చెందిన వారైనప్పటికీ తమ కళాశాలలో విద్యనభ్యసించి ఉత్తమమైన మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు. కళాశాల టాపర్లుగా నిలిచిన ఈ విద్యార్థుల తల్లిదండ్రులు సంతకం కూడా రాని నిరక్షరాస్యులనీ, అయినప్పటికీ వాళ్ళ పిల్లలను తమ కళాశాలలో చేర్పించి మంచి నిర్ణయం తీసుకున్నారనీ అభినందించారు. కూరాకుల మహేష్ తండ్రి అన్నంపేట గ్రామానికి చెందిన తప్పెటగుళ్ళు కళాకారుడు సూర్య నారాయణ కాగా, సీతంపేట మండలం మొఖరనాయుడు గూడకు చెందిన సవర రాజు తల్లిదండ్రులు కూడా రోజువారీ కూలీలు అని తెలిపారు. విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, ఆంగ్ల అధ్యాపకులు టి.అప్పలనాయుడు, రామకృష్ణ లను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రత్యేక తరగతులు... ఇంటర్మీడియట్ కమీషనర్ శేషగిరిబాబు ఆదేశానుసారం డీవీఈఓ కోట ప్రకాశరావు సూచన ప్రకారం సోమవారం నుంచి ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ భూషణ రావు తెలిపారు. పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూవ్మెంట్ కు దరఖాస్తు చేసుకున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి ప్రజాదరణ చూసి ఓర్వలేని టిడిపి శ్రేణులు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

విశాలాంధ్ర-టెక్కలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి లభిస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక పోతున్నారని టిడిపి శ్రేణులలో ఓటమి భయం పట్టుకుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు కార్యక్ర మంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం రాష్ట్ర ప్రజల మన్ననలు పొందాయని, ఒక కోటి 80 లక్షల గృహాలకు వెళ్లిన గృహసారధులు చేస్తున్న కార్యక్రమంలో జగనన్న ప్రభుత్వం తీరు తెన్నులపై మెగా పీపుల్ సర్వే నిర్వహిస్తే దాదాపు అన్ని కుటుంబాల వారు రాజకీయాలకు అతీతంగా జగనన్న ప్రభుత్వాన్ని దీవిస్తూ ఒక కోటి 80 లక్షల మిస్డ్ కాల్స్ పార్టీ కార్యాలయానికి అందాయని, రాబోయే 30ఏళు మళ్లీ జగనన్నే రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. 2024 ఎన్నికల్లో టెక్కలి నియోజక వర్గ ప్రజలు వైసిపి కి 60వేలు మెజార్టీ ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. తెదేపా వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ శతజయంతి వేడుక లు జరపడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యే అచ్చంనాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రజలను దోచుకున్నారు తప్ప వారి కోసం ఒక్క సంక్షేమ కార్యక్రమం కూడా చేపట్టకపోవడం సిగ్గుచేటని దుయ్య బట్టారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ, సచివాలయ కన్వీనర్లు చిగిలిపల్లి మోహన్ రావు, జాధ్యాడ జయరాం, బాడాన మురళి, వైసిపి నాయకులు బమ్మిడి తులసిరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల వారికి ఆదర్శం కావాలి : ప్రముఖ వైద్యులు దానేటి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మనం ఎక్కడ ఏ రంగంలో నున్న, ప్రజలకు ఏ రకమైన సేవలు అందించిన గాని, భవిష్యత్ తరాల వారికి అవి ఆదర్శం కావాలని ఆ దశగా ప్రతి ఒక్కరు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్ అన్నారు. మెళియాపుట్టి మండలం భరణికోట పంచాయతీ పరిధిలో గల భావనపురం ఎంపీయుపి పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి, మహాత్మాగాంధీ, స్వామివివేకానంద, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, ధవళ కవితారాజేంద్రలు విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు దానేటి శ్రీధర్ మాట్లాడుతూ మనం ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడంతోపాటు ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. మహనీయుల చరిత్ర యువతకు ఆదర్శం కావాలంటూనే, మనం ఏపని చేపట్టిన తద్వారా ప్రజలకు సేవలు అందించడంతోపాటు భవిష్యత్ తరాల వారికి ప్రయోజనం కలిగే రీతిలో ఉండాలన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, స్వామి వివేకానంద, మహాత్మాగాంధీలను ఆదర్శంగా చేసుకుని వారి అడుగుజాడల్లో ముందుకు వెళ్లవలసిన అవసరం ఎంతైనా ఉందని అనేక అంశాలపై మాట్లాడారు. అనంతరం భావనపురం గ్రామంలో రెండు లక్షల రూపాయలతో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.అలాగే ధవళ కవితరాజేంద్ర మాట్లాడుతూ గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయనికి కావలసిన గ్రానైట్‌ను తనువంతుగా ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దానేటి శ్రీధర్ కు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో వైద్యులు దానేటి శ్రీధర్ తోపాటు కవితరాజేంద్ర, మెట్ట గోపాలకృష్ణ, మజ్జి దుర్యోధన, బమ్మిడి బాలక్రిష్ణ, ఎండ భాస్కరరావు, యుండ యుంగదర్, ప్రధానోపాధ్యాయులు తలగపు కామేశ్వరరావు, బమ్మిడి శశికుమార్, సీతారాములు, మన్మధరావు, ఢిల్లీశ్వరరావు, రవి, కృష్ణమూర్తి, మురళి, జగ్గారావు, మహిళలు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

'ముస్తాక్' నియామకంపై హర్షం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రపంచస్థాయి క్రేజ్ ఉండే క్రికెట్‌లో యువతరం బాగా రాణిస్తుందని, అటువంటి క్రికెట్ సంఘానికి అనుభవం కల్గిన వ్యక్తిని జిల్లా కార్యదర్శిగా నియమించడం హర్షణీయమని స్థానిక ఐ.సి.సి అభిప్రాయపడింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా నియమితులైన సయ్యద్ ముస్తాక్ అహ్మద్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపి, అతని సేవలతో జిల్లా క్రికెట్ క్రీడాకారులు మరింత ఉన్నతిని సాధించగలరనే ఆశాభావాన్ని స్థానిక ఐ.సి.సి అధ్యక్ష కార్యదర్శులు దాసరి రాజు, బిశ్వరంజన్ పట్నాయిక్, కోచ్ దక్కత గోపిలు అన్నారు.

పాఠశాలలో సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపట్టండి

ఎస్ఎంసి సమావేశంలో తల్లిదండ్రుల ఆగ్రహం



విశాలాంధ్ర-మెళియాపుట్టి : పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కార దిశగా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని, అటువంటి పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఎందుకు నిర్వహించాల్సి నంత అవసరం ఏముందని? ఎస్ఎంసి సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మెళియాపుట్టి మండలం, చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయులు గణపతిరావు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పలు సూచనలు చేస్తూనే, పాఠశాలలో చాలా వరకు అపరిశుభ్రంగా ఉందని, ప్రధానంగా చాపర మెయిన్ రోడ్డు నుంచి మురుగునీరు పాఠశాలలోకి నేరుగా ప్రవేశిస్తుందని ఇదే విషయమై గతంలో సైతం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయులకు, విద్యా కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచు వారి దృష్టికి పలుమార్లు తెలియజేసినప్పటికీ సమస్య పరిష్కారంలో ఎటువంటి ముందడుగులేదన్నారు. వర్షం పడిందంటే కాలవలో నుండి మురుగునీరు, చెత్తాచెదారం అంతా పాఠశాల దరికి చేరుతుండడంతో, దీంతో విపరీతమైన దుర్గంధభరితమైన వాసన వస్తుండడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రతినిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాగే పాఠశాల లోపలకి పందులు ప్రవేశించి పాడుచేస్తున్నయని తక్షణమే ఈ మురుగునీరు దారి మళ్లించి పాఠశాలను పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతిరావుతో పాటు విద్య కమిటీ చైర్మన్ వంజరాపు శ్రీరాములు, దుక్క బాలరాజు, విద్యార్థులు తల్లిదండ్రులు గండేటి చిన్నారావు, దారపు రాము, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని మాణిక్యపురం 11 కె.వి ఫీడర్ పరిధిలోగల గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ వి.ఏ రాజశేఖర్, ఏఈ నేతాజీ ఒక ప్రకటన ద్వారా తెలియ జేశారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ కు అంతరాయం కలుగుతున్నట్లు తెలిపారు. లెవెన్ కె.వి ఆర్డబ్ల్యూఎస్ లీడర్ పరిధిలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున వరక మాణిక్యపురం, బల్లిపుట్టుగ, కుసుంపురం పంచాయతీ పరిధిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేసవి సెలవులు విద్యార్థులకే... ఉపాధ్యాయులకు కాదు

మే 1 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మే 1వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలన్నింటికి వేసవి సెలవులు ప్రారంభమౌతున్నాయి. అలాగని ఈ సెలవుల్లో ఉపాధ్యాయులు తమ సొంత పనులు చేసుకోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్ళడానికి అవకాశం లేదు. మే 1నుంచి జూన్ 10వ తేదీ వరకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం పలు కార్యక్రమాల్ని నిర్దేశించింది. వీటన్నింటిని ఉపాధ్యాయులు ఖచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే. పైగా ఈ అమలు తీరుపై విద్యాశాఖ ఉన్న తాధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తుంటారు. వేసవి సెలవుల్లో ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు 23రకాల కార్యకలాపాల్ని నిర్వహించాలి. దీంతో ఈ వేసవి సెలవులు విద్యార్థులకే తప్ప ఉపాధ్యాయులకు ఏ విధంగానూ ఉపక రించవు. పైగా ఈ సెలవుల్లో ఉపాధ్యాయుల బాధ్యతలు మరింతగా పెరగనున్నాయి.ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల్ని ఈ నెలాఖరులోగా బృందాలుగా విభజించాలి. ఒక్కో బృందాన్ని ఒక్కోఉపాధ్యాయుడు దత్తత తీసుకోవాలి. ఆ ఉపాధ్యాయుడు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయాలి. ఈ గ్రూపుల్లో ప్రతి రోజు నీతి కథల్ని పోస్టు చేయాలి. ఆ కథల్ని చదివిన తర్వాత విద్యార్థుల అభిప్రాయాల్ని సేకరించాలి. అలాగే విద్యార్థుల చదివే సామర్థ్యాన్ని అంచనా వేయాలి.అందుకనుగుణంగా పాఠశాల గ్రంథాలయం నుంచి ఒక్కొక్కరికి కనీసం ఐదేసి పుస్తకాల్ని చదివేందుకు విద్యార్థులకు సరఫరా చేయాలి. ఇందుకోసం అవసరమైన పుస్తకాలు ఏ ఏ గ్రంథాలయాల్లో ఉన్నది కూడా ఉపాధ్యాయులే సూచించాలి. పట్టణాలు, నగరాల్లోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు నిర్వహిస్తున్న గ్రంథాలయాలకు వెళ్ళి అవసరమైన పుస్తకాల్ని తెచ్చుకునే అవగాహనను విద్యార్థులకు కల్పించాలి. ఈ పనులన్నింటిని నిర్వహించడంతో పాటు ఎప్పటికప్పుడు వీటిని రికార్డు చేయాలి. ఈ రికార్డుల్ని అధికారులు పరిశీలిస్తారు.

ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి : వేసవి సెలవుల్లోనే రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి పిల్లల ప్రవేశంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. తమ ప్రాంతంలో 1వ తరగతిలో చేరే వయసున్న పిల్లల్ని గుర్తించాలి. అలాగే 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థుల్ని ఆరోతరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివేలా ప్రోత్సహించాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న వసతులు, విద్యావిధానాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. వీటన్నింటితో పాటు మే 1 నుంచి జూన్ 12వ తేదీ వరకు తమ పరిధిలోని పిల్లలకు మేము చదవడానికి ఇష్ట పడతాం కార్యక్రమాన్ని అమలు చేయాలి.

నాడు నేడు పనుల పరిశీలన : వీటన్నింటితో పాటు ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహిస్తున్న అదనపు తరగతి గదుల పనుల్ని కూడా ఉపాధ్యాయులు పరిశీలించాలి. మరో వైపు పదోతరగతి ఫలితాలు వెలువడ్డాక విద్యార్థులకు టిసిల జారీ బాధ్యత కూడా ఉపాధ్యాయులదే. ఇందుకోసం ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సెలవు రోజుల్లో కూడా పాఠశాలకు హాజరుకావాలి. ఒకవేళ ప్రధానోపాధ్యాయునికి తప్పనిసరి పని తగిలితే మరోక ఉపాధ్యాయుడుకి ఆ బాధ్యత అప్పగించాలి. దీంతో ఈ సారి ఉపాధ్యాయులు వేసవి సెలవులు ఉపశమనం కల్పించే అవకాశాల్లేవు.

ముస్లింలను మరోసారి మోసం చేస్తున్న చంద్రబాబు

మండల కో-అప్షన్ మెంబర్ రంజాన్‌రాజుబాయ్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : చంద్రబాబు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తన స్వార్థం కోసం ముస్లిం మైనార్టీల ప్రయోజనాలను పణంగా పెట్టడానికి ఎప్పుడూ వెనకాడరని, మతతత్వ బిజెపితో చెలిమి చేసేందుకు అర్రులు చాచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని మండల కో-అప్షన్ మెంబర్ ఎస్.కె. రంజాన్ రాజుబాయ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలో ఉండగా మైనార్టీల సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోని చంద్రబాబునాయుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ తన సెక్యులర్ ముసుగును తొలగించి అసలు సిసలైన మతతత్వ నైజాన్ని బహిర్గతం చేసుకున్నారని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్‌తో చెలిమి చేసి బిజెపిపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీపై సైతం వ్యక్తిగత విమర్శలు చేశారని, ఎన్నికలు సమీపిస్తున్న వేళ మతతత్వ బిజెపికి ఇలా సాగిలాపడడం సిగ్గుచేటని అన్నారు. బిజెపితో చెలిమి చేసేందుకు పవన్ కళ్యాణ్ ద్వారా ఎన్ని రాయబారాలు పంపినా బిజెపి పెద్దలు తిరస్కరించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తానే స్వయంగా రంగంలోకి దిగి రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీ మైనార్టీల అభీష్టానికి విరుద్ధంగా భారతీయ జనతా పార్టీతో చేతులు కలిపేందుకు చంద్రబాబు ప్రయత్నించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శమని తీవ్రంగా దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలన్నీ జగన్మోహన్ రెడ్డి గారి పాలనలో సువర్ణ యుగాన్ని చూస్తున్నాయని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని చేకూర్చాలని వజ్ర సంకల్పంతో ఉన్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని పార్టీ నుంచి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను విడదీయలేమని నిర్ధారణకు వచ్చిన చంద్రబాబు మతతత్వ శక్తులకు రాష్ట్రంలో రాజమార్గం వేసేందుకు కుట్రపన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కుయుక్తులను రాష్ట్రంలోని ముస్లిం సమాజం నిశితంగా గమనిస్తుందని, సమయం వచ్చినప్పుడు తెలుగుదేశం పార్టీని మైనార్టీలంతా ఏకతాటి పైకి వచ్చి భూస్థాపితం చేసి తన సత్తా ఏంటో చంద్రబాబుకు చూపిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో తమకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం లభిస్తుందని, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని విధాలుగాను ముస్లిం సమాజం బలోపేతం అయ్యేందుకు జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్న రుణం తీర్చుకునేందుకు ముస్లిం మైనార్టీలంతా సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంతరం జగనన్న పై అసందర్భయమైన విమర్శలు చేస్తూ నవ్వుల పాలయ్యే టిడిపి మైనారిటీ నేతలు సైతం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు మింగుడు పడక తేలు కుట్టిన దొంగల్లా మౌనం వహిస్తూ ముస్లిం సమాజం నుంచి మొహం చాటుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

ప్రపంచ పశువైద్య దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-పాతపట్నం : పశు వైద్యశాల లో ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పాతపట్నం శాసనసభ్యులు రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మానవాళి మనుగడలకు, ఆరోగ్య సంరక్షణకు పశు పోషణ అత్యంత ఆవశ్యకతని అన్నారు. ముందుగా పసువైద్యశాలలో ఏర్పాటు చేసిన గోపాల కృష్ణ ని విగ్రహానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉత్తమ పశు వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే సన్మాన సత్కార్యం చేసారు. పశు సంవర్ధక శాఖ ఏడి మంచు కరుణాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాతపట్నం వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, పిఏసిఎస్ అధ్యక్షులు ఎం శ్యామ్ సుందర్రావు, ఏయంసి చైర్మన్ కొండాల అర్జునరావు, తాసిల్దార్ రవిచంద్ర, ఎంపీడీవో జయంతి ప్రసాద్, ఈవోఆర్డి నర్సిహ్మప్రసాద్ పండా, పసు వైద్యులు పి అనీల్, శ్రీ వాణీ,మోనికా తోపాటు హిరమాండలం మండల పార్టీ అధ్యక్షుడు ఎం రామకృష్ణ, ఎల్.ఎన్.పేట పార్టీ అధ్యక్షుడు విష్ణు, మెలియాపుట్టి ఎంపీపీ ఉదయ్ కుమార్, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి రామారావు,వైసీపీ నాయకులు ఏనుగుతల సూర్యం, బి నారాయణమూర్తి, పద్ద నేతాజీ,సవిరిగాన కృష్ణారావు, రజిక సంఘ జిల్లా అధ్యక్షుడు గోరి శెట్టి వెంకటరమణ, తో పాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపట్ల సెలవుల్లో అప్రమత్తం వ్యవహరించండి : హెచ్‌ఎం మూర్తి

విశాలాంధ్ర-హిరమండలం : వేసవి సెలవుల్లో తల్లిదండ్రులంతా విద్యార్థుల పట్ల జాగ్రత్త వ్యవహరించాలని హిరమండలం జి హెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు ఎస్ ఎస్ ఎన్ మూర్తి అన్నారు. శనివారం హిరమండలం ఉన్నత పాఠశాలలో తల్లి దండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం మూర్తి మాట్లాడుతూ ఆదివారం నుంచి వేసవి సెలవు లు కావడంతో ఇంటి వద్ద నే నేటి నుంచి విద్యార్థులు ఉండడం వల్ల రాబోయే తరగతి బుక్స్ చదివించడం, ఎండల్లో తిరగ నీయకుండా, చూడడం, నదులు, బావి లు వద్ద కు పంపించవద్దని కోరారు. ఇన్ని జాగ్రత్త లు పాటించాలని ఈ సందర్భంగా తెలియ జేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ చైర్మన్ జి కృష్ణవేణి, డైరెక్టర్ పాయలు శంకర్, జి సురేష్, ఎ విశ్వనాథం, వి అప్పారావు, వి అన్న పూర్ణ, పి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీకటి పేటలో అగ్ని ప్రమాదం



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో చీకటిపేట గ్రామంలో శనివారం మూడు పశువుల శాలలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో చీకటి సింహాచలం, చిన్నం నాయుడు, లక్ష్మణరావు, శాలలు కాలిపోయాయి. ట్రాక్టరుకు సంబంధించి కొంత సామాగ్రి ప్రమాదంలో కాలి బూడిద అయ్యాయి. పక్కన వున్నా సాల లో చీకటి రఘుకి చెందిన కార్ కు అగ్ని వేడి తగిలి కారు అద్దాలు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ రాజేశ్వరరావు సంఘటనా స్థలానికి రెవిన్యూ సిబ్బంది పంపి నష్టాన్ని అంచనా వేసారు. సుమారు 60వేలు ఆస్తి నష్టం జరిగిందని నివేదిక ను ఉన్నత అధికారులకు పంపిస్తామన్నారు.

సాంకేతిక లోపంతో టమాట లారీ దగ్ధం

విశాలాంధ్ర-పలాస : మండలం కోసంగిపురం జాతీయ రహదారిపై శనివారం రాత్రి సాంకేతిక లోపంతో టమాట లోడ్‌తో వెళుతున్న లారీ దగ్ధమైంది. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక కాశీబుగ్గ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. కాశీబుగ్గ పోలీసుల కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం కోలార్ ప్రాంతం నుండి పశ్చిమబెంగాల్ వైపు టమాట లోడ్‌తో వెళుతున్న లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి ఒక్కసారిగా క్యాబిన్ మొత్తం మంటలు అలముకున్నాయి. దీంతో డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై లారీ నుండి కిందకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పటికే లారీ అంతా కాలిపోతుండగా టమాట లోడ్ పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సాంకేతిక లోపం వలనే మంటలు వ్యాపించాయని పలాస అగ్నిమాపక ఎస్‌ఐ సోమేశ్వరరావు తెలిపారు. ఈ సంఘటనతో రూ. 25లక్షల నష్టం వాటిల్లిందని చెప్పారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలించిన గిరిజన రైతుల పోరాటం

లినెల రోజుల్లో పట్టాలిస్తామన్న డిఆర్‌ఓ

హర్షం వ్యక్తం చేసిన సిపిఎం నేతలు, గిరిజన రైతులు

విశాలాంధ్ర-మేపాద : పోడు పట్టాలకై గిరిజను రైతులు చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది.మండలంలోని కొండగంగు బూడి పంచాయతీ పరిధిలో గల 9గ్రామాల నుంచి ఏపీ రైతు సంఘం నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యంలో కదలి వచ్చిన గిరిజన రైతులందరూ సర్వే చేసిన సిద్ధంగా ఉన్న మా పట్టాలు మాకు ఇవ్వాలన్న డిమాండ్తో శుక్రవారం ఉదయం నుంచి వంటావార్పు చేపట్టారు.ఆందోళనకారులతో శుక్రవారం తహసిల్దార్ చర్చించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మా చేతిలో లేదని అంతా జిల్లా అధికారి చేతిలో ఉందని తహసీల్దార్ చెప్పిన నేపథ్యంలో జిల్లా అధికారులు వచ్చి పట్టాలు మంజూరు చేయాలి,లేదా సమాధానం చెప్పాలన్న డిమాండ్‌తో గిరిజన రైతులు భీష్మించుకొని కూర్చోవడంతో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు తాహసీల్దార్ కార్యాలయానికి చేరుకొన్న ఆయన మాట్లాడుతూ కేజీ ఫోర్టి గిరిజన రైతుల సాగులో ఉన్న భూములకు సంబంధించి మండల తాసిల్దార్ కార్యాల నుంచి భూముల్లో ఉన్న రైతుల పేర్లు రికార్డులు చేసి పంపించడం జరిగిందని కొండ పోరంబోకు భూములను డిపట్టగా మార్చి సిద్ధం చేయడం జరిగిందని త్వరలో కమిటీ ఆమోదం అయిన వెంటనే పట్టాలు తయారు చేసి గిరిజన రైతులకు నెలరోజుల్లో పట్టాలు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.దీనితో ఆందోళనకారులు సంతోషం వ్యక్తం చేస్తూ ఈ ఆందోళనలో బాగా సహకరించిన రెవెన్యూ సిబ్బందికి,పోలీసు యంత్రంగానికి,గిరిజన నేతలు ధన్యవాదాలు తెలిపారు. 9గ్రామాల నుంచి హాజరైన రైతులు హర్షం వ్యక్తం చేస్తూ పోరాటాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చల్ల జగన్ గాడి అప్పారావు, గ్రామ సర్పంచ్ గలారి బంగాయ్య, వైస్ ఎంపీపీ భర్త దాయరి నరసింహమూర్తి,గిరిజన సంఘం నాయకులు సుగురు గంగులు, సార వెంకట్రావు,చేపల బైరాగి, కంబాల బంగారయ్య, రాజబాబు, అప్పలకొండ, కేదాటి సత్యం తదితరులు నాయకత్వం వహించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

విశాలాంధ్ర-సోంపేట : ప్రకృతి వ్యవసాయం అవలంభించడం మంచి లాభదాయకమని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పేర్కొన్నారు. మండలం పలాసపురం గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తులను, దిగుబడులను సాధించాలని అన్నారు. తద్వారా ఆరోగ్యానికి, పంట పొలాలకు ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కుమారి, కృష్ణవేణి, పుష్పలత, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు డా.కణితి సంతాప సభ

విశాలాంధ్ర-పలాస: మాజీ ఎం.పి, బిజెపి కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కణితి విశ్వనాథం సంతాప సభను ఆదివారం ఉదయం 10గంటలకు ఆయన స్వగృహం గౌతమ్ నివాస్ వద్ద నిర్వహిస్తున్నట్లు కుమారుడు రాజేంద్ర, కుమార్తె శారద, అల్లుడు డాక్టర్ రాజేష్, అభిమానులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ హేంబాబు చౌదరిలు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో డాక్టర్ కణితికి అనుబంధం ఉందని గుర్తు చేశారు. కోట్లాది రూపాయలు విలువ గల ఐటిఐ ఆస్తులను ప్రభుత్వానికి ఉచితంగా దారాదత్తం చేసిన మహనీయుడని ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ స్థాయి నాయకులు డాక్టర్ కణితి అభిమానులు సంతాప సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, ఐటిఐ ప్రిన్సిపాల్ జవహర్, రవి, పాలవలస వైకుంఠరావు, త్యాడిలు పాల్గొన్నారు.

ఏడుగురిపై కుక్కలు దాడి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : ఒకేరోజు ఏడుగురు వ్యక్తులకు కుక్కలు దాడి చేసిన సంఘటనతో ప్రజలు బీతులుతున్నారు. ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా విషయం అందరికి తెలిసిందే.దీంతో రోడ్డుల పై వెళ్తున్న వారితో పాటుగా చిన్న, పెద్ద కారణం ఏమి లేకుండా ప్రతి ఒక్కరిపై దాడి చేస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీంతో కుక్కల బారి నుంచి తమను రక్షించండంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మెళియాపుట్టి మండలం, చాపర గ్రామంలో శనివారం నాడు ఒకరోజులో ఏకంగా ఏడుగురుకు కుక్క కాటుకు బలి అయినట్టు చాపర వైద్యురాలు హేమంతలక్ష్మీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు సుమారు కుక్క కాటుకు గురైన బాధితులకు వైద్యం అందిస్తున్నామన్నారు. రోజురోజుకి వాటి తీవ్రత మరింత పెరుగుతుందని, అధికంగా పిల్లలు, మహిళలే ఉన్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కుక్కల బెడద నుండి తమను రక్షించాలంటు మండల ప్రజానీకం కోరుతున్నారు.

విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

విశాలాంధ్ర-పొందూరు: విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని తాడివలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు అన్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రగతి సాధించడానికి తల్లిదండ్రులు నిరంతరం పాఠశాలను సందర్శించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులపై ఉన్న నమ్మకంతోనే తమ పిల్లలను ఈ బడిలో చేర్పించామని పలువురు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తమ్మినైన ప్రసాదరావు, ఉపాధ్యాయులు మరియు భారీ సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంచార్జి డీఈవోని కలిసిన సామల

విశాలాంధ్ర-పార్వతీపురం : మన్యం జిల్లా , ఇంచార్జి విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర రావును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సంఘం రూపొందించిన డైరీను ఆయనకు అందజేసినట్లు ఏపీ ఎస్సీఎస్టీ ఉపాధ్యాయసంఘం రాష్ట్రఅధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. పదోతరగతి సప్లమెంటరీ స్పాట్ కేంద్రం పార్వతీపురంలో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనకు పంపించాలని, పలు ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన తెలిపారు.

కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఔదార్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నగరంలోని శాంతఅనురాగ నిలయంలోని పిల్లలకు లంచ్ బాక్స్ బ్యాగ్‌లను, పిల్లలకు మరియు వృద్ధులకు పండ్లను పంపిణి కార్యక్రమాన్ని చెపట్టేరు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం ఎన్నో మంచి కార్యక్రమాలను నిర్విస్తుందన్నారు. అనాథ పిల్లలకు, వృద్ధులకు తమ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సహాయం చేయడం ఆనందాయకమన్నారు, ఇకముందు కూడా తమ కళాశాల ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలను చేపడతామన్నారు కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లను అభినందించారు, విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ మజ్జి శ్రీనివాసరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి!

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు తీసుకువచ్చిన అంశాలు లేదా కౌన్సిలర్లు ప్రతిపాదించిన పనులు సకాలంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసుకోని పరిస్థితి దారుణమని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్ సమన్వయంతో ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండా అంశాల చర్చ ప్రారంభమయ్యే సరికి అధికార పార్టీకి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ తన వార్డులో పనులు జరిపించని తీరు పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసారు. ఏడాది క్రితం పురుషోత్తపురం గ్రామంలో రోడ్లు కాలువల అభివృద్ధికి 60వేల రూపాయలను కేటాయించినా ఇంకా ఎందుకు పనులు ప్రారంభం కాలేదని, వార్డులో ప్రజలకు ముఖం చూపెట్టలేకున్నామని అన్నారు. అజెండాలోని ఐదు అంశాలు ఆమోదింపజేసుకున్నాక జరిగిన చర్చలో 9వ వార్డు కౌన్సిలర్ సయ్యద్‌ఖాన్ చెఱువుతో పాటు ఆ దగ్గర్లో ఉండే చెఱువులను అభివృద్ధి పర్చాలని పట్టణంలో చెఱువుల ఆక్రమణలపై దృష్టి సారించాలని కోరారు. నిర్లక్ష్యం కారణంగానే 14వ ఆర్థిక సంఘం నిధులు వెనక్కి వెళ్ళిపోయాయని, కనీసం 15వ ఆర్థిక సంఘం నిధులైనా సకాలంలో సక్రమంగా వినియోగించాలని 11వ వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు. ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్న సూచనకు కమీషనర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుమారు 15వీధుల ప్రజలు ఉపయోగించే సయ్యద్‌ఖాన్ చెఱువు మరమ్మత్తులు తక్షణం పూర్తి చేయించి వేసవిలో నీటిని అందివ్వాలని 8వ వార్డు కౌన్సిలర్ పి.మధుమూర్తి కోరారు.

చూడి ఆవుకు శస్త్రచికిత్స : ఆవు క్షేమం... దూడ మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : నరసన్నపేట మండలం బుచ్చన్న పేట గ్రామానికి చెందిన జాయ అమ్మారావుకు సంబం దించిన చూడి ఆవు శనివారం తెల్లవారు జాము నుండి ప్రసవవేదనతో బాధపడుతుంటే అక్కడపశువైద్య సహాయకులు సాధారణ ప్రసవంకోసం ప్రయత్నించినా కుదరకపోవటంతో చివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువులు కోసం ఏర్పాటు చేసిన మొబైల్ అంబులెటరీ వెహికల్ కోసం 1962 నెంబర్‌కు ఫోన్‌చేసి దీని సహాయంతో కురుడు వెటరినరీ డిస్పెన్సరీకు తీసుకువచ్చారు. కోటబొమ్మాళి పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ కురుడు పశువైద్య శాలకు చేరుకొని ఆవుని పరిశీలించి దూడ మరణించినదని నిర్ధారణకు వచ్చిన తరువాత ఆ అవుకు శస్త్రచికిత్స చేసి దూడను తీయటం తీశారు. అయితే అప్పటికే దూడ మృతి చెందింది. ఆవు క్షేమంగా ఉంది. ఆవు గర్భంలో దూడ పరిమాణం బాగా పెరిగిపోవటం మరియు గర్భాశయ ముఖద్వారం చిన్నదిగా ఉండటం వలన ఆవు ప్రసవం కాలేకపోయినది అందుకే దూడ ఆవు కడుపులో మృతిచెందిందని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆవును ప్రాణాలు కాపాడినందుకు డాక్టర్ కిరణ్‌కుమార్‌కు పాడి రైతు అమ్మారావు అభినందనలు తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో 'మేడే' విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-నరసన్నపేట : శ్రీసంతోషిమాత భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మేడే విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్షులు, తర్ల లక్ష్మణరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1886సంవత్సరంలో చికాగో నగరంలో 8గంటల పని కోసం కార్మిక వర్గం పోరాటం చేసి, త్యాగాలతో సాధించుకున్నారని, ఆ స్ఫూర్తిని కార్మిక వర్గం నేడు ఫలాలుగా అనుభవిస్తున్నారని తెలిపారు. మేడే సంధర్భంగా యూనియన్ కార్యాలయంలో జెండా వందనం, మధ్యాహ్నం భారీ అన్నదాన వితరణ నిర్వహిస్తామని, ఈకార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని లక్ష్మణరావు కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఎల్.చలపతి రావు, కార్మిక సంఘ ప్రతినిధులు, అక్కునాయుడు, తంగి వెంకటరావు, బగ్గు గురుమూర్తి, రాజాపు తవుడు, వాన అప్పారావు, బోర సూర్యనారాయణ, ముద్దాడ కృష్ణ, మల్లేశు, ముద్దాడ బువ్వాజీ, కరగాన కొండయ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-బెలగాం : చిన్నారుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డా. టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం 15,18,19 వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య స్థితి వివరాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. మునుపటి నెలల్లో నమోదైన గణాంకాలకు, ప్రస్తుతానికి ఉన్న మార్పును పరిశీ లించారు. కొంత మంది పిల్లలు బరువు, ఎత్తు ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి వయస్సుకు తగ్గట్టుగా ఉన్నదీ లేనిదీ గమనించారు. ఎంసిపి కార్డులో ఉన్న గ్రోత్ చార్ట్‌లో ప్రతి నెలా నమోదు చేయాలని సాధారణ స్థితిలో లేని వారిని గుర్తిస్తే ప్రత్యేక పర్యవేక్షణ చేసి అవసరమైతే ఎన్ఆర్‌సి కేంద్రానికి పంపించాలని సూచించారు. అనంతరం ఆయన ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్లు, మాత్రలు లభ్యతను పరిశీలించారు. వారానికి రెండసార్లు తప్పకుండా పిల్లలకు ఐరన్ సిరప్ వేయాలని వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా వేసవి కాలం రీత్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్ ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతినెలా వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది సమన్వయ సమావేశం జరిపి పిల్లల, గర్భిణీల ఆరోగ్యం పై సమీక్ష చేయాలని డిఐఒ సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయాగౌడ్, ఎఎన్ఎం నారాయణమ్మ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులను ఎంపిడిఓ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని నిడగల్లు, వెంకటపురం గ్రామాల్లోని జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపిడిఓ ప్రసాద్ శనివారం తనిఖీలు నిర్వహించారు. మస్టర్లు తనిఖీలు చేసారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేతన దారులకు నిర్దేశించిన కూలీడబ్బులు వచ్చే విధంగా రెండు పూటలా పనులు చేయాలని కోరారు. వేసవిఎండలు దృష్ట్యా తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేయాలని కోరారు. ఆయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.